క్లుప్తంగా

కాలువ పూడికతీత పనులు

దుమ్ముగూడెం: మండలంలోని అంజిపాక దగ్గర తాలిపేరు ప్రధాన కాలవ నుంచి ఆర్‌డీ 18 వైపు వచ్చే కాలవ పూడుకుపోవటంతో స్పందించిన యలమంచి శ్రీను బాబు యలమంచి సీతారామయ్య ట్రస్ట్ సహకారంతో, రైతు సంఘం ఆధ్వర్యంలో జేసీబీ పెట్టి పూడిక తీయించారు. ఈ పనులను వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పరిశీలించి ట్రస్టును అభినందించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, రైతు సంఘం సీనియర్ నాయకులు తెల్లం ధర్మయ్య, కోరే రాము, వెంకటేశ్వరరావు, చిరంజీవి పాల్గొన్నారు.

సీఎంకు ఫిర్యాదు చేస్తాం..

చర్ల: ఏజెన్సీలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఇసుక అక్రమాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని తెలంగాణా జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం చర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో కొందరు బడాబాబులు గిరిజన చట్టాలను తుంగలో తొక్కి ఇసుక అక్రమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఆయా ఇసుక క్యారీలను వెంటనే ప్రభుత్వం నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు పూనెం ప్రదీప్, రేపాక వెంకట రామారావు పాల్గొన్నారు.

పూరిల్లు నేలమట్టం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట కాలనీ గ్రామానికి చెందిన మడవి కామరాజుకు చెందిన పూరిల్లు మంగళవారం ఉదయం నేలమట్టమైంది. కామరాజు ఇంటి ఎగువ ప్రాంతంలోని గుట్ట నుంచి వస్తున్న నీటి ఊట కారణంగా నానిపోవడంతో కూలిపోయింది. పూరిల్లు కూలే సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో బాధిత కుటుంబానికి సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని, బాధిత కుటుంబం కోరుతోంది.

అధికారుల విచారణ

మణుగూరుటౌన్: గత పదిరోజులుగా మెప్మా సిబ్బందిపై వివిధ ఆరోపణలతో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న రావుల కుమారస్వామి, పోలమూరి శ్రీదేవిలు జిల్లా కలెక్టర్‌కి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం మణుగూరులో విచారణ నిర్వహించారు. సంపంగి ఎస్‌ఎల్‌ఎఫ్, చందన ఎస్‌ఎల్‌ఎఫ్‌లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు నేపథ్యంలో విచారణ నిర్వహించి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విచారణకు వచ్చిన అధికారులు శ్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్, మెప్మా డీఎంసీ రాజేశ్, ఏడీఎంసీ చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ.. అదనపు కలెక్టర్ విద్యాచందనకు నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు.

లిఫ్ట్‌ను ప్రారంభిస్తారా?

దుమ్ముగూడెం: మండల రైతాంగానికి వరప్రదాయనీగా ఉపయోగపడే ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని ఈ ప్రభుత్వమైన ప్రారంభిస్తుందా అని మచ్చా వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. మంగళవారం ముసలిమడుగు గ్రామంలో సీతానగరం, పెద్ద బండి రేవు శాఖ మహాసభల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.. ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకం పూర్తి అయితే దుమ్ముగూడెం మండలంలోని 45 గ్రామాలలోని ఆదివాసి రైతాంగానికి 20వేల ఎకరాలకి లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఇంత ప్రాధాన్యత కలిగిన ఈ ప్రాజెక్టు గురించి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం సోచనీయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, నాయకులు వాగే ఖాదర్ బాబు, సోయం వీర్రాజు, సకినాల సతీష్, మట్ట లక్ష్మీనర్సు, కనకారావు,కోరం మురళి, నాగుల పార్వతి, కొమరం రత్నం, హరిబాబు, నాగమణి, రాము, సోయం సుశీల, సారయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో వార్డెన్ మృతి

గుండాల: గుండాల గిరిజన బాలికల హాస్టల్ వార్డెన్ గోనె కుమారి(45) అనారోగ్యతో మృతి చెందారు. గత వారం రోజులుగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతుండగా.. సోమవారం రాత్రి పరిస్థితి విషమించింది. దీంతో స్థానికులు గుండాల ఆస్పత్రి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలని స్వగ్రామమైన పాల్వంచకు తరలించారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు..

గుండాల: గుండెపోటుతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పోకల శ్రీనివాస్ మంగళవారం మృతి చెందాడు. ఆలపల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యం పొందుతుండగానే సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ మండల నాయకులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

క్రికెట్ లీగ్ ప్రారంభం

దుమ్ముగూడెం: మండల పరిధిలోని ములకపాడు హాస్పిటల్ క్రీడా మైదానంలో మంగళవారం దుమ్ముగూడెం టాలెంట్ క్రికెట్ లీగ్‌ను సీఐ అశోక్‌తో కలిసి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ ప్రారంభించారు. మాజీ జెడ్పీటీసీ సీతమ్మ, ఎస్సై గణేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వినీల్, నాయకులు అబ్బులు, శివాజీ, దర్శి సాంబశివరావు, పిలక వెంకటరమణారెడ్డి, కుంజ శ్రీనివాస్ రావు, ఉబ్బ వేణు, కోడి చంటి నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ పండుగ వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను చిన్నారులు నెత్తిన పెట్టకొని వచ్చి, పాఠశాలలో ఆవరణలో పెట్టి ఉత్సాహంగా బతుకమ్మలాడారు. తొలుత గౌరమ్మకు పూజలు చేశారు. పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు అంతరించిపోకుండా ముందు తరాలకు అందించాలని సూచించారు. ఆపై బతుకమ్మ సంబరాలు విద్యార్థుల కోలాహాలంతో హోరెత్తాయి. దీంతో ఆయా పాఠశాలలో పండుగ సందడి నెలకొంది.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటరూరల్: ఉన్నత పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



భద్రాచలంటౌన్: విద్యార్థులు, ఉపాధ్యాయులతో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్.



కరకగూడెంలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



చంద్రుగొండ: గుర్రాయిగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ వేడుకలు



చర్ల: బతుకమ్మలతో సందడి చేస్తున్న రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం విద్యార్థులు



ములకలపల్లి: తిమ్మంపేట పాఠశాలలో బతుకమ్మలతో చిన్నారులు



బూర్గంపాడు: న్యూసెంచరీ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

మండలానికి కలెక్టర్ ప్రశంస

బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల నిర్వహణ బాగుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రశంసించారు. ఈ మేరకు మంగళవారం కొత్తగూడెంలోని ఐడీఓసీలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డిని, సారపాక గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్, నాగినేనిప్రోలు గ్రామపంచాయతీ కార్యదర్శి బాలయ్యను ఘనంగా సత్కరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను రీయూజ్, రెడ్యూస్, రీసైక్లింగ్ చేసే కార్యక్రమంలో భాగంగా ఏకో బ్రిక్స్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అన్ని గ్రామపంచాయతీలను ఆదేశించారు. ఏకో బ్రిక్స్ తయారీలో జిల్లాలో సారపాక ప్రథమస్థానంలో, నాగినేనిప్రోలు దితీయ స్థానంలో నిలిచాయి. ఇందుకుగాను ఎంపీడీఓ, గ్రామపంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) విద్యాచందన, డీపీఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంపీడీఓ జమలారెడ్డి

షహనాజ్‌కు కలెక్టర్ సన్మానం

అశ్వాపురం: మండల కేంద్రంలోని మంచికంటినగర్‌లోని ఆరిఫా అండ్ రోష్ని వృద్ధాశ్రమం నిర్వాహకురాలు షహనాజ్ బేగంను కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వయోవృద్ధుల దినోత్సవంలో ఎన్నో సంవత్సరాలుగా వృద్ధాశ్రమం నిర్వహిస్తూ చేస్తున్న సేవలకుగాను షహనాజ్‌బేగంను కలెక్టర్ సన్మానించారు.

టీకాలు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బాలాజీ నాయక్

మణుగూరుటౌన్: ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేలో అర్హులైన పిల్లలకి సరైన సమయంలో టీకాలు అందించాలని, అవసరమైన వారిని ఎస్‌ఆర్‌సీకి రిఫర్ చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా టీబీ పీవో డాక్టర్ కల్యాణ్ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు అనిపించిన వెంటనే తెమడ పరీక్షలకు పంపాలన్నారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు శివకుమార్, నిశాంత్‌లు వివరించారు.

పాలాభిషేకం..

మణుగూరురూరల్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాలలో వాటా చెల్లించడం పట్ల హర్షం వ్యక్తం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ చిత్రపటానికి మంగళవారం పీవీకాలనీ అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ మాజీ ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయలింగు, బి.భీమరాజు, హతిరాం, ఉపేంద్ర, హిమాంబి, నరసింహరావు, శ్రీను, నాగేశ్వరరావు, లక్ష్మణ్, వెంకన్న పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం నాయిబ్రహ్మణ పట్టణ కమిటీని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా వల్లాజి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా సోమనపల్లి నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెలకంటి రఘునాథబాబు, ఉపాధ్యాక్షుడిగా ఆదిమూలం శ్రీకాంత్, కోశాధికారి మల్యాల శ్రీనివాస్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ఉపేంద్ర, ప్రవీణ్, సుబ్బారావు, రమేష్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీపై గ్రామసభలు

దుమ్ముగూడెం: మండలంలో 2025–26 సంవత్సరానికిగాను మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపునకు సంబంధించి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈదయ్య మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. కూలీలు,మేట్లు, రైతుల సహకారంతో లేబర్ బడ్జెట్ అంచనా వేసి గ్రామసభల అమోదంతో పనులు మంజూరు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈజీఎస్ ఏపీఓ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు ప్రణాళికలు సకాలంలో తయారు చేయాలన్నారు.

అవగాహన సదస్సు

అశ్వాపురం: మండల పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో మణుగూరు భారజల కర్మాగారం అధికారులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇటీవల భారజల కర్మాగారం నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్ విషవాయువు వాసనకు గ్రామస్తులు ఇబ్బంది పడటంతో అధికారులు అవగాహన సదస్సు నిర్వహించి విషవాయువు వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

టెండర్ దరఖాస్తు గడువు పెంపు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి వైద్యశాలలో, పీకేఓసీలో ఏసీ అంబులెన్సుల నిర్వహణ కోసం టెండర్లు వేసేందుకు దరఖాస్తు గడువును పెంచినట్లు ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్ తెలిపారు. మంగళవారనం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల కాలపరిమితితో నెలకు వెయ్యి కిలోమీటర్ల చొప్పున ప్రతి రోజూ 24గంటల పాటు సేవలందించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5గంటల లోపు ఈ అంబులెన్సుల నిర్వహణ టెండర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ ప్రభావిత, నిర్వాసితులకు తొలి ప్రాధాన్యత, సింగరేణి మాజీ ఉద్యోగులకు, మిగతా వారికి ఆ తర్వాత ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు ఏరియా పర్చేస్ విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరుటౌన్: దసరా సంబురాలను పురస్కరించుకుని మణుగూరు పీవీకాలనీలో భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే సింగరేణి వేడుకలకు అక్టోబర్ 12న తినుబండారాల స్టాల్స్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం (పర్సనల్) సలగల రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. స్టాల్స్ ఏర్పాటుకు స్థానిక వ్యాపార సంస్థల అవుట్ లెట్స్‌ను విక్రయించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 10వ తేదీన సాయంత్రం 5గంటలలోగా పర్సనల్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7075972531, 8332975284 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మలుపుల పరిశీలన

చంద్రుగొండ: మండలం గుండా విస్తరించి ఉన్న జాతీయ రహదారిపై మలుపులను (టర్నింగ్) అధికారులు మంగళవారం పరిశీలించారు. అయన్నపాలెం, తిప్పనపల్లి, మద్దుకూరు గ్రామాల్లోని మలుపుల వద్ద ఎక్కువశాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీస్‌శాఖ ఉన్నతధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ గంజి స్వప్న, ఆర్‌అండ్‌బీ ఏఈ లఖన్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వారు సమీక్షించారు.

చెక్కుల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రత్నకాంత్, వెంకటరెడ్డి, నాగేంద్ర, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

అశ్వాపురం: కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ వాలీబాల్ పోటీల్లో మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ స్వప్న ఆకోజ్ విద్యార్థులను అభినందించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ బీ.రవి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాకేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వాలంటరీ బ్లడ్ డొనేషన్ దినోత్సవం



రక్తదానం చేస్తున్న విద్యార్థి..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో మంగళవారం నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ దినోత్సవం సందర్భంగా మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ పాల్ రాజ్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం రక్తదార శిబిరాన్ని ఉద్దేశించి భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ, భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.మధు ప్రసాద్ మాట్లాడారు. శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీతారామ ఆటో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రాయల శ్రీను, యూనియన్ సభ్యులు రఘు, భాను, నాగేశ్వరరావు, నరసింహారావు ,సంతోష్, సాయికుమార్, ప్రవీణ్ రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ట్రస్ట్ సభ్యులు బూరం.నవీన్ ప్రభుత్వ ఏరియా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ శ్రీను నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బూర్గంపాడు: అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా పేదలకు అందిస్తామన్నారు. వేపలగడ్డలో ఐటీసీ నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఆయన ప్రారంభించారు. భారీవర్షాలు, వరదలకు కృష్ణసాగర్ గ్రామపంచాయతీలో 40 పశువులు మృత్యువాత పడగా.. బాధిత రైతులకు ప్రభుత్వం తరపున ఆయన పరిహారమందించారు. పినపాక పట్టీనగర్, ఉప్పుసాక గ్రామాలలో అనారోగ్యంతో మంచం పట్టినవారిని పరామర్శించి ఆర్థికసాయమందించారు. ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అయా కార్యక్రమాలలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎస్ఐ రాజేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బట్టా విజయ్‌గాంధీ, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు కైపు లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భజన ప్రసాద్, మహ్మద్‌ఖాన్, తాళ్లూరి జగదీశ్వరరావు, మందా నాగరాజు, బర్ల నాగమణి తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే పాయం

మంత్రి చొరవతోనే మంచిధర

ములకలపల్లి: వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపడం వల్లే ఆయిల్‌పాం ధర గణనీయంగా పెరిగిందని ఆయిల్‌పాం రైతు సంఘ నాయకులు పర్వతనేని అమర్‌నాథ్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి తుమ్మల కృషితో ఆయిల్‌పాం టన్ను ధర రూ.17,043లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఒకే దఫాలో సుమారు రూ.3వేల వరకూ పెంచడంపట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. సంఘ రైతులు కరుటూరి కృష్ణ, చిలకపాటి జై చందర్‌రావు, పువ్వాల మంగపతి, బింగి శేషగిరిరావు, కీసరి జైరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం..

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ గెలల టన్ను ధర పెంపుదలకు కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సాగుదారులంతా రుణపడి ఉంటారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు అన్నారు. మంగళవారం అశ్వారావుపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జ్యేష్ట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, పాలవలస జీవన్ రావు, కాసాని పద్మ శేఖర్, జల్లిపల్లి దేవరాజు, ముళ్లగిరి కృష్ణ పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు ముగిసిన శిక్షణ



ధ్రువీకరణ పత్రాలను అందుకున్న గ్రామ మంచినీటి సహాయకులు

అశ్వారావుపేటరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు గడిచిన నాలుగు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం ముగిసింది. మంగళవారం శిక్షణా కార్యక్రమంలో భాగంగా తాగునీటి నల్లాలు, పైపులైన్ల మరమ్మతులపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా డీఈఈ ఎస్‌కే సలీం మాట్లాడుతూ.. తాగునీటి ఇబ్బందులు రాకుండా పని చేయాలని సూచించారు. ముగింపు సందర్భంగా శిక్షణకు హాజరైన వారందరికీ ధ్రువీకరణపత్రాలను ఆయన చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఏఈఈ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోట దేవదానం మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ పడిన టి.చైతన్య, దేవదానానికి 49 చొప్పున ఓట్లు రావడంతో చెరో ఆరు నెలలు బాధ్యతలు నిర్వర్తించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు చైతన్య పదవీకాలం మగియడంతో దేవదానం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా మెజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వరరావు పాల్గొనగా సీనియర్ న్యాయవాది మాదిరెడ్డి రమణారావు అధ్యక్షత వహించారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కె.శ్రీమన్నారాయణ, రేపాక కృష్ణకుమారి, దన్నాల రాము, శర్మ, మోహన్‌కృష్ణ, పులుసు తరుణి, తాత లలిత, సింగం శ్రీధర్, సున్నం రమేష్, కుంచాల రమేష్, అరుణశ్రీ, రెహమత్, సాధనపల్లి సతీష్‌ను నియమించారు. ఎన్నికల అధికారి నందూరి శ్రీనివాసరావు, ఏపీపీ శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు ఎం.వీ.రమణ, ప్రధాన కార్యదర్శి పూసల శ్రీనివాసాచారితో పాటు కొడాలి శ్రీనివాసన్, పడిసిరి శ్రీనివాస్, పామరాజు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై దాడికి ఖండన

దమ్మపేట: మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఖండించారు. మూసీ బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న కేటీఆర్‌పై దాడి చేయడం అమానుషం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరగబడితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉండరని హెచ్చరించారు.

జీపీల్లో 'స్వచ్ఛతా హీ సేవా'



చెరువులో మొక్కలను వదులుతున్న ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

అశ్వారావుపేటరూరల్: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను మంగళవారం పలు గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. మండలంలోని నారంవారిగూడెం, మద్దికొండ, ఊట్లపల్లి, గుర్రాల చెరువు, మామిళ్ల వారిగూడెం, నారాయణపురం, అనంతారం తోపాటు మరో 13 గ్రామ పంచాయతీల్లోని సాగునీటి చెరువుల్లో నీటిని శుద్ధి చేసే సత్యనారాయణ పూల మొక్కలను వదిలారు. ఈ మొక్క వేర్లు అడుగు భాగంలోకి వెళ్లి బురదనీటిని శుద్ధి చేస్తాయని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎంపీఓ సోయం ప్రసాద్, ఈజీఎస్ ఏపీఓ కె.రామచంద్రరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'వేస్ట్ టూ ఆర్ట్'లో విద్యార్థి ప్రతిభ

భద్రాచలం: జిల్లా స్థాయిలో జరిగిన వేస్ట్ టూ ఆర్ట్ –2024 పోటీల్లో భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ప్రతిభను చాటాడు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం జూనియర్ కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించగా.. జూనియర్ కళాశాల భద్రాచలంలో ఏఈటీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న కె.రామ్ చరణ్ ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించాడు. దీనిని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు సైతం వివరించి మన్ననలు పొందాడు. పోటీలో ద్వితీయ బహుమతి పొందగా.. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డి.సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు బాలకృష్ణ, పి.ఆనంద్ బాబు తదితరులు అభినందించారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

మణుగూరురూరల్: విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఏసీఎంఓ తెల్లం రమణయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రం అంబేడ్కర్ సెంటర్‌లోని ఏజీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం, ముందస్తు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీఎంఓ రమణయ్య హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కుంజా మహలక్ష్మి, ఉపాధ్యాయులు టి.వీరభద్రం, ఐ.రాణి, కె.సుబ్బలక్ష్మి, వై.సుగుణ, సీఆర్‌టీలు పి.శ్రీదేవి, ధనలక్ష్మి, చిట్టిబాబు, రజిత, సావిత్రి, సుజాత, వసంత, మహేష్, విద్యార్థునుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల విధులపై డాక్యుమెంటరీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం గ్రామ పంచాయతీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు, వారి సాధక బాధకాలపై సోమవారం భద్రాచలం ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శనలు ఇచ్చారు. ఐటీసీ వావ్ (ఈ–శ్రీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ డాక్యుమెంటరీ ప్రదర్శనను నిర్వాహకులు (ఐటీసీ వావ్) ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శనకుగాను బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థినికీ ప్రశంస పత్రాలను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ కాలశాల ప్రిన్సిపాల్ పద్మావతి, డాక్టర్ స్పందన, ఐటీసీ వావ్ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రమ్య, ఫీల్డ్ కోఆర్డినేటర్లు సౌజన్య, రాజేశ్వరి, గ్రామపంచాయతీ సిబ్బంది చంద్రశేఖర్, సూపర్వైజర్లు, ఆటో డ్రైవర్లు, హెల్పర్లు, సీఆర్పీలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వావ్ సంస్థ బాధ్యులు